క్లుప్తంగా

మాతృ భాషపై పట్టు అవసరం



విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న మాఊళ్లో గ్రంథాలయం అధ్యక్షుడు ధన శ్రీను

మునగపాక: ప్రతి విద్యార్థికి మాతృభాషపై పట్టు సాధించాల్సిన అవసరం ఉందని మాఊళ్లో గ్రంథాలయం అధ్యక్షుడు భీశెట్టి ధన శ్రీను అన్నారు. మండలంలోని మంగళవరపు పేటలోని మాఊళ్లో గ్రంథాలయం ఆధ్వర్యంలో విద్యార్థులకు ఆదివారం దేశభక్తి గీతాలు, తెలుగు భాష గొప్పదనంపై పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా శ్రీను మాట్లాడుతూ మాతృ భాషలో పట్టుంటే ఆంగ్ల భాషలో కూడా పట్టు సాధించవచ్చన్నారు. సెలవు రోజుల్లో చదువుపై దృష్టి సారించాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయం కార్యదర్శి యల్లపు సంజీవరావు, డైరెక్టర్లు తులసీ, సునీ, గ్రంథాలయ సహాయకుడు ఆడారి జగ్గప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

ఉపమాకలో గీతా పారాయణం



ఉపమాకలో గీతాపారాయణం చేస్తున్న శ్రీకృష్ణపరివార్ సభ్యులు

నక్కపల్లి: ఉపమాక వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం ఏకాదశి సందర్భంగా భగవద్గీత పారాయణం జరిగింది. కాకినాడ శ్రీకృష్ణ పరివార్ వ్యవస్థాపకుడు పెద్దిబొట్ల మాధురి రామకృష్ణ ఆధ్వర్యంలో 100 మంది సేవకులతో ఈ గీతా పారాయణం చేపట్టారు. ఇప్పటికే అన్నవరం, తిరుపతి, శ్రీకాళహస్తి, పాలకొల్లు, భీమవరం, కురుక్షేత్రం, మంత్రాలయం, సర్పవరం, మామిడివాడ, చాగంటి వారి గోశాల, పిఠాపురం, మధుర, ఢిల్లీ, యాగంటి, అహోబిలం, అమరావతి, మంగళగిరి, అమలాపురం తదితర ప్రాంతాల్లో ఉన్న ఆలయాల్లో గీతాపారాయణం చేశామని మాధురి రామకృష్ణ తెలిపారు.

ఉచిత నేత్ర వైద్య శిబిరానికి స్పందన



నేత్ర పరీక్షలు చేస్తున్న వైద్యులు

మునగపాక: మండలంలోని మూలపేటలో ఆదివారం ఏర్పాటు చేసిన ఉచిత నేత్ర వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. భువనేశ్వరి కంటి ఆస్పత్రి ఆధ్వర్యంలో జరిగిన ఈ శిబిరాన్ని సర్పంచ్ భీశెట్టి గంగప్పలనాయుడు ప్రారంభించారు. సుమారు 120 మంది రోగులకు ఆస్పత్రి వైద్యుడు శ్రీనివాసరావు పరీక్షలు చేశారు. అవసరమైన వారికి మందులు అందజేశారు. ప్రతి ఒక్కరూ ఆరు నెలలకొకసారి కంటి పరీక్షలు చేసుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు ఆడారి జగన్నాథరావు, కాండ్రేగుల వరలక్ష్మి, బొడ్డేడ ఆదికుమార్, కాండ్రేగుల ఆదినారాయణ, పెంటకోట మహేష్ తదితరులు పాల్గొన్నారు.

రీసర్వే గ్రామసభలకు 1,396 అర్జీలు



పీఎన్ఆర్ పేట గ్రామసభలో రైతుల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న అధికారులు

యలమంచిలి రూరల్: ప్రభుత్వ ఆదేశాల మేరకు మండలంలోని 9 రెవెన్యూ గ్రామాల్లో ఈ నెల 26వ తేదీ వరకు నిర్వహించిన రీసర్వే గ్రామ సభల్లో రైతులు, ఆయా గ్రామాల ప్రజల నుంచి 1396 అర్జీలు అందాయని తహసీల్దార్ వరహాలు తెలిపారు. వీటిలో 769 అర్జీలు తమ భూమి విస్తీర్ణం తగ్గిందని, తప్పుగా నమోదైన భూమి క్లాసిఫికేషన్ సవరణకు 25, పేర్లు సవరణకు 135, సర్వే నంబరు కోరిలేషన్ కోసం 39, వెబ్‌ల్యాండ్‌లో భూమి వివరాలు నమోదు కోసం 373, ఉమ్మడి ఆస్తుల పంపకానికి 29, పాసు పుస్తకాల్లో తప్పుల సవరణకు 22, ఇతర అర్జీలు 3 మొత్తం 1396 అర్జీలు స్వీకరించామని ఆయన చెప్పారు.



సముద్రంలో మధ్యలోకి ఏర్పాటు చేసిన జెట్టీ



జెట్టీ పైనుంచి సముద్రాన్ని తిలకిస్తున్న పర్యాటకులు



రేవుపోలవరం తీరంలో ఉల్లాసంగా గడుపుతున్న పర్యాటకులు

రేవుపోలవరం బీచ్.. అభివృద్ధికి దూరం

- పర్యాటకులను కట్టిపడేస్తున్న అందాలు
- రోజురోజుకీ పెరుగుతున్న సందర్శకుల సంఖ్య
- పర్యాటకాభివృద్ధికి నోచుకోని బీచ్ పరిసరాలు



కొండపై ఏర్పాటు చేసిన శివపార్వతుల విగ్రహాలు



తీరానికి ఆనుకుని సహజ సిద్ధంగా ఏర్పడిన పెద్దరాళ్లు గుహలు

నక్కపల్లి: ఎస్.రాయవరం మండలం రేవుపోలవరం బీచ్ పర్యాటక ప్రాంతాలకు పెట్టింది పేరు. ఇక్కడి ప్రకృతి అందాలు ఎంత చూసినా తనివి తీరదు. కానీ అభివృద్ధికి ఆమడ దూరంలో ఉండిపోయింది. 16 నంబరు జాతీయ రహదారికి సుమారు 10 కిలో మీటర్ల దూరంలో రేవుపోలవరం బీచ్ ఉంటుంది. ఇక్కడ వాతావరణం ఎంతో ఆహ్లాదకరంగా ఉంటుంది. రోజురోజుకు సందర్శకుల సంఖ్య పెరుగుతున్నా అభివృద్ధిలో మాత్రం వెనుకబడుతోంది. ఈ బీచ్‌కు ఎస్.రాయవరం, నక్కపల్లి, యలమంచిలి, తదితర ప్రాంతాల వారే కాకుండా నర్సీపట్నం, తుని, పాయకరావుపేట, అనకాపల్లి, కోటవురట్ల తదితర ప్రాంతాల నుంచి కూడా పర్యాటకులు అధిక సంఖ్యలో తరలివస్తుంటారు. ఇక్కడ తీరానికి ఆనుకుని ఉన్న కొండపై లక్ష్మీమాధవ స్వామి ఆలయం ఉంది. విశాఖపట్నం కైలాసగిరిపై మాదిరిగా ఇక్కడ పెద్ద శివపార్వతుల విగ్రహాలు కనువిందుగా దర్శనమిస్తాయి. తీరానికి ఆనుకుని ఉన్న పెద్ద పెద్ద బండరాళ్లు చెక్కిన శిల్పాల్లా పర్యాటకులను ఆకర్షిస్తాయి. ఎప్పుడో అవసరాల కోసం నిర్మించిన జెట్టీ తీరం నుంచి 50 మీటర్ల సముద్రంలోకి ఉంటుంది. దీని పైనుంచి సముద్రంలో కొంత దూరం పర్యాటకులు వెళ్లి ఎగిసిపడుతున్న కెరటాలను చూసి ఆస్వాదిస్తుంటారు. మాఘ పౌర్ణమి, మహాశివరాత్రి పర్వదినాల్లో పరిసర ప్రాంతాల నుంచి పుణ్యస్నానాలు ఆచరించేందుకు వేలాది మంది భక్తులు తరలివస్తుంటారు. ఆర్టీసీ కూడా ప్రత్యేక బస్సులను నడుపుతుంటుంది. అనకాపల్లి జిల్లాలోనే ప్రముఖ తీర ప్రాంత పర్యాటక ప్రాంతంగా రేవుపోలవరం గుర్తింపు పొందింది. మరో వారం రోజుల్లో కార్తీక మాసం ప్రారంభం కానుంది. పిక్నిక్‌ల సందడి మొదలు కానుంది. కనీస సౌకర్యాలు లేమి పర్యాటకులను వేధిస్తోంది.

వేధిస్తున్న మౌలిక వసతుల లేమి!

ఇంతటి ప్రాముఖ్యతను కలిగి పర్యాటకులను ఎంతగానో ఆకట్టుకుంటున్న రేవుపోలవరం బీచ్‌కు పర్యాటకపరంగా తగినంత ప్రాధాన్యత లేదనే చెప్పాలి. కనీస సౌకర్యాలు ఇక్కడ లేవు. ఒకటో, రెండో మరుగుదొడ్లు మినహా ఇక్కడ ఇక్కడ పెద్దగా సదుపాయాలు లేవు. తాగునీటి కోసం కూడా నానా అవస్థలు పడాల్సిందే. స్నానమాచరించిన అనంతరం మహిళలు దుస్తులు మార్చుకోడానికి వసతులు లేవు. తీరానికి ఎదురుగా ఉన్న కొండపై ఏర్పాటు చేసిన శివపార్వతుల విగ్రహాల చుట్టూ సరైన రక్షణ ఏర్పాటు చేయలేదు. గతంలో టీడీపీ ప్రభుత్వంలో రూ.3 కోట్లు కేటాయించారు. విగ్రహాలు ఏర్పాటు చేసి కొండపైకి సీసీ రోడ్డు వేయడం, కాటేజీల నిర్మించాలనేది నిర్ణయం. విడుదలైన నిధుల్లో కోటి రూపాయల మేర ఖర్చు చేసి, మిగతా నిధులు కాంట్రాక్టర్లు, రాజకీయ నాయకుల జేబుల్లోకి వెళ్లి పోయాయని విమర్శలు ఉన్నాయి. జమ్ముగడ్డితో కాటేజీలు నిర్మించినప్పటికీ మూణ్నాళ్ల ముచ్చటగానే మిగిలిపోయాయి. ప్రస్తుతం శివపార్వతుల విగ్రహాలు ఉన్న కొండ ప్రాంతం మందుబాబులకు అడ్డాగా మారింది. విగ్రహాల చుట్టూ పార్క్ మాదిరిగా తీర్చిదిద్దితే బాగుంటుందదని పలువురు అభిప్రాయపడుతున్నారు. పోలీసుల నిఘా లేకపోవడంతో మందుబాబులు తీరం వెంబడి ఉన్న రాళ్లు, గుహల వద్ద మందు పార్టీలు చేసుకుంటున్నారు. తాగి పడేసిన బీరు, మద్యం సీసాలను ముక్కలు చేసి ఇసుక తిన్నెలపైనే పడేస్తున్నారని పలువురు పర్యాటకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆకతాయిలు బీచ్ పరిసరాలను అధ్వానంగా తయారు చేస్తున్నారు. ప్రభుత్వం కూడా ఇంతటి ప్రాచుర్యం పొందిన బీచ్‌పట్ల నిర్లక్ష్యం చేస్తోందన్న వాదన వినిపిస్తోంది. ఇప్పటికైనా పర్యాటక శాఖ అధికారులు స్పందించి బీచ్ పరిసరాలను ఆకతాయిల ఆగడాల నుంచి కాపాడి పర్యాటకులను ఆకట్టుకునేలా అభివృద్ధి చేయాలని పలువురు కోరుతున్నారు.

బీచ్ పరిసరాలు బాగున్నాయి..

రేవు పోలవరం బీచ్ బాగుంటుందని గాజువాక నుంచి చూడ్డానికి వచ్చాం. ఇక్కడ తీరం, చుట్టు పక్కల ప్రాంతాలు, సహజ సిద్ధంగా ఏర్పడిన రాళ్లు, గుహలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. వీకెండ్‌లో ఉల్లాసంగా గడిపేందుకు విశాలమైన తీరం ఇది. చాలా ప్రశాంతంగా ఉంది. సదుపాయాలు మాత్రం సరిగ్గాలేవు. కొండపై శివపార్వతుల విగ్రహాలు ఏర్పాటు చేసినప్పటికీ సరైన రోడ్డు లేదు. ఇసుక తిన్నెలపై బీరు, మద్యం సీసా ముక్కలు ప్రమాదకరంగా ఉన్నాయి.

– లిఖిత, గాజువాక

మందుబాబులకే అనుకూలం

వీకెండ్‌లో నెలకు రెండు సార్లు రేవుపోలవరం బీచ్‌కు వస్తుంటాం. ఇక్కడ రెండు కిలోమీటర్ల తీరం చాలా ఆహ్లాదకరంగా ఉంటుంది. అయితే బీచ్‌ను అభివృద్ధి చేసి పర్యాటకులను ఆకట్టుకునేలా సదుపాయాలు కల్పించపోవడం విడ్డూరం. అభివృద్ధి చేస్తే యూజర్ చార్జీల పేరుతో ఆదాయం కూడా వచ్చే అవకాశం ఉంది. పర్యాటకుల కంటే పార్టీలు చేసుకునే వారికే సదుపాయాలు ఎక్కువగా ఉన్నాయి. ప్రభుత్వం స్పందించి పర్యాటకుల కోసం కాటేజీలు లేదా షెడ్లు ఏర్పాటు చేస్తే బాగుంటుంది. పిల్లల కోసం ఆట పరికరాలు ఏర్పాటు చేయాలి.

– నరేష్‌కుమార్, నర్సీపట్నం

ఘనంగా బంగారు తల్లి ఆలయ ప్రారంభోత్సవం



అమ్మవారిని దర్శించుకుంటున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

నక్కపల్లి: అమలాపురం గ్రామంలో బంగారుతల్లి, నూకాలమ్మ, కనకమహాలక్ష్మి ఆలయ ప్రారంభోత్సవం ఆదివారం ఘనంగా జరిగింది. వేడుకల్లో భాగంగా రెండు రోజుల పాటు హోమాలు, కలశ స్థాపన, మండపారాధన, అగ్నిప్రతిష్టాపన, విగ్రహ ప్రతిష్ట వంటి కార్యక్రమాలు నిర్వహించారు. వేద పండితుల వేద మంత్రాల నడుమ విశేష పూజా కార్యక్రమాలు జరిగాయి. కలశాలను గ్రామంలో ఊరేగించారు. ఆలయంలో నూతనంగా ఏర్పాటు చేసిన అమ్మవార్లను వైఎస్సార్‌సీపీ నాయకులు వీసం రామకృష్ణ, పొడగట్ల పాపారావు, సూరాకాసుల గోవిందు, వైస్ ఎంపీపీ వెలగా ఈశ్వరరావు, సర్పంచ్‌లు తళ్ల భార్గవ్, పొడగట్ల వెంకటేష్, ఎంపీటీసీ సభ్యులు గంటా తిరుపతిరావు, వంకా కృష్ణ, తదితరులు దర్శించుకున్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు



మునగపాకలో ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేస్తున్న సిబ్బంది

మునగపాక: విద్యుత్ సరఫరాలో ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నామని విద్యుత్ శాఖ ఏఈ గోపీ తెలిపారు. మునగపాక ఇందిరమ్మ కాలనీని ఆనుకొని కొద్ది రోజులుగా మరమ్మతులకు గురైన ట్రాన్స్‌ఫార్మర్ స్థానంలో ఆదివారం కొత్తది ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు, గృహ వినియోగదారులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామన్నారు. వినియోగదారులు కూడా సిబ్బందికి సహకరించాలన్నారు. ఎక్కడైనా విద్యుత్ పరమైన సమస్యలు వస్తే తన దృష్టికి తీసుకురావాలన్నారు.

కేళీలతో అన్నదాతలో కలవరం



కైలాసపట్నం ప్రాంతంలో వరిలో కేళీలు

కోటవురట్ల: వరిలో కేళీలు రైతులను ఆందోళనకు గురిచేస్తున్నాయి. పంట పచ్చగా ఏపుగా పెరిగినా ఎక్కువ శాతం కేళీలు కనిపించడంతో పంట దిగుబడిపై ఆందోళన నెలకొంది. నాట్లు వేసి పంట వంద రోజుల దశకు చేరుతున్న క్రమంలో విత్తన లోపాలు బయటపడుతున్నాయి. పలు ప్రాంతాలలో కేళీలు అధికంగా కనిపించడంతో కంపెనీ ప్రతినిధులు స్పందించాలని రైతులు కోరుతున్నారు. పైగా ఈ ఏడాది ప్రభుత్వం రైతులకు కుచ్చుటోపీ వేసింది. గత ప్రభుత్వంలో మాదిరి ఖరీఫ్ ఆరంభంలో పెట్టుబడి సాయం అందుతుందని రైతులు ఆశపడ్డారు. రైతుల ఆశలపై నీళ్లు చల్లుతూ అన్నదాత సుఖీభవ పథకానికి ఎగనామం పెట్టింది. పెట్టుబడి సాయం అందకపోవడంతో రైతులపై అప్పుల భారం పడింది. తప్పని పరిస్థితుల్లో రైతులు అప్పులు చేసి నాట్లు వేశారు. ఓ పక్క కేళీలు, మరో పక్క అప్పుల బాధ రైతుకు కంటిమీద కునుకులేకుండా చేస్తోంది. మండలంలో ఈ ఏడాది ఖరీఫ్ సీజనులో 15,342 ఎకరాలలో వరి సాగు జరిగింది. గతేడాది 14,824 ఎకరాలలో వరి నాట్లు వేయగా వాతావరణం అనుకూలంగా ఉండడంతో ఈ ఏడాది సాగు విస్తీర్ణం పెరిగింది. వాతావరణం బాగుంది కదా లాభాలు అధికంగానే వస్తాయన్న నమ్మకంతో రైతులు ఎక్కువగా సాగు చేశారు. అయితే ప్రస్తుత పరిస్థితి రైతులను ఆందోళనకు గురిచేస్తోంది. 20 శాతం వరకు కేళీలు కనిపిస్తుండడంతో దిగుబడి గణనీయంగా తగ్గే ప్రమాదం ఉందని కలవరపడుతున్నారు. కైలాసపట్నం, జల్లూరు, అన్నవరం, రాజుపేట, కోటవురట్ల, లింగాపురం, రామచంద్రపురం, చౌడువాడ, పాములవాక, యండపల్లి, బి.కె.పల్లి, నీలిగుంట తదితర ప్రాంతాలలో వరిలో కేళీలు అధికంగా కనిపిస్తున్నాయి.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఎస్.రాయవరం: కొరుప్రోలు సబ్‌స్టేషన్ పరిధిలో పెనుగొల్లు పీహెచ్‌సీ ఏరియా, రేవుపోలవరం గ్రామాల్లో సోమవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుందని అనకాపల్లి ఈఈ రాజశేఖర్ తెలిపారు. ఈ లైన్లలో మెయింటెనెన్స్ పనులు కారణంగా ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

11న శూలాల మహోత్సవం



మాట్లాడుతున్న సాంబశివ ఆలయ కమిటీ చైర్మన్ శ్రీనివాసరావు

మునగపాక: ఉత్తరాంధ్రలో పేరొందిన మునగపాక శూలాల మహోత్సవం వచ్చేనెల 11న ఘనంగా నిర్వహించేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని సాంబశివ ఆలయ కమిటీ చైర్మన్ బూడిద శ్రీనివాసరావు కోరారు. ఆదివారం ఆలయ ప్రాంగణంలో కమిటీ సభ్యులు, పెద్దలతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్తీక మాసంలోని రెండో సోమవారం ఏటా ఈ ఉత్సవాన్ని నిర్వహించడం ఆనవాయితీగా వస్తుందన్నారు. ఈ ఏడాది కూడా ఉత్సవాన్ని రాజకీయాలకు అతీతంగా ఘనంగా నిర్వహించేందుకు ముందుకు రావాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ దిమ్మల అప్పారావు, జనసేన మండల అధ్యక్షుడు టెక్కలి పరశురామ్, పెద్దలు మొల్లేటి సత్యనారాయణ, పిల్లి అప్పారావు, దాడి శివ, అలంక ప్రకాశరావు, ఆడారి లక్ష్మణరావు, ఆడారి మహేష్, తదితరులు పాల్గొన్నారు.

ఐదో రోజూ అయ్యప్ప భక్తులకు భిక్ష



:అయ్యప్పస్వామి ఆలయ ప్రాంగణంలో భిక్ష తీసుకుంటున్న భక్తులు

మునగపాక: స్థానిక అయ్యప్పస్వామి ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన భిక్ష కార్యక్రమం ఆదివారం నాటికి 5వ రోజుకు చేరుకుంది. అయ్యప్ప భక్తులతో పాటు శివ మాలలు ధరించే భక్తుల సౌకర్యార్థం ఏటా ఆలయ ప్రాంగణంలో భిక్ష సదుపాయాన్ని కల్పిస్తున్న విషయం తెలిసిందే. ఈ ఏడాది కూడా 40 రోజుల పాటు భిక్ష అందించనున్నారు. పలు ప్రాంతాలకు చెందిన భక్తులు ఈ భిక్ష సదుపాయాన్ని వినియోగించుకుంటున్నారు.

జిల్లా స్థాయి చెకుముకి పోటీలకు విశేష స్పందన



రాష్ట్ర స్థాయి చెకుముకి పోటీలకు ఎంపికైన విద్యార్థులతో నిర్వాహకులు

అచ్యుతాపురం(మునగపాక): జిల్లా స్థాయి చెకుముకి పోటీలకు విశేష స్పందన లభించింది. అచ్యుతాపురంలోని ప్రశాంతి పాలిటెక్నిక్ కళాశాలలో ఆదివారం నిర్వహించిన ఈ పోటీల్లో 60 టీమ్‌లు తలపడ్డాయి. చీడికాడ మండలం అప్పలరాజుపురం హైస్కూల్‌కు చెందిన జె.గుణశ్రీ, నవ్యశ్రీ, శ్రీ ప్రకాష్ విద్యా సంస్థల నుంచి సాత్విక్, కిరణ్‌కుమార్‌లు విశాఖలో నవంబర్ 9, 10 తేదీల్లో జరగనున్న రాష్ట్రస్థాయి చెకుముకి పోటీలకు ఎంపికయ్యారు. సంబంధిత విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందజేశారు. జన విజ్ఞాన వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షులు త్రిమూర్తుల రెడ్డి, పి.గంగరాజు, ఎం.శేషగిరిరావు, రమేష్, వర్మ, శ్రీరామమూర్తి, అనకాపల్లి జిల్లా అధ్యక్షులు నాగచంద్ర, ప్రధాన కార్యదర్శి మారిశెట్టి వెంకట అప్పారావు, కార్యదర్శి బొడ్డేడ రామ్ కుమార్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రమణ, తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఆవు పాల సేకరణ ధరను పునరుద్ధరించాలి



వాల్ పోస్టర్ ప్రదర్శిస్తూ నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

అచ్యుతాపురం(మునగపాక): విశాఖ డెయిరీ తగ్గించిన పాల సేకరణ ధరను పునరుద్ధరించాలని కోరుతూ ఆదివారం అచ్యుతాపురంలో సీపీఎం ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఎం నాయకుడు రొంగలి రాము ఆయన మాట్లాడుతూ విశాఖ డెయిరీ రైతులకు మేలు జరిగేలా చూడాలన్నారు. పశుపోషణ కష్టతరమవుతున్న రోజుల్లో డెయిరీ నుంచి రైతులకు ప్రోత్సాహం ఉండాలే గానీ, వారికి అన్యాయం జరిగేలా చర్యలు చేపట్టడం సరికాదన్నారు. గత రెండు సంవత్సరాలుగా రైతులకు బోనస్ అందించకపోవడం తగదన్నారు. రైతులకు న్యాయం జరగకుంటే పాడి రైతులను సమీకరించి ఉద్యమిస్తామని హెచ్చరించారు. వాల్ పోస్టర్ ప్రదర్శిస్తూ నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు రామకృష్ణ, సత్యనారాయణ, నాయుడు, సత్తిబాబు, తదితరులు పాల్గొన్నారు.

శివ పూజలను ఘనంగా నిర్వహించాలి



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే విజయకుమార్

మునగపాక: కార్తీకమాసం రెండో సోమవారం వాడ్రాపల్లిలో జరగనున్న శివ పూజలను ఘనంగా నిర్వహించాలని ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ కోరారు. ఈ మేరకు కరపత్రాలను ఆదివారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉత్తరాంధ్రలో గుర్తింపు పొందిన వాడ్రాపల్లి దక్షిణేశ్వరుని ఆలయంలో జరిగే ప్రత్యేక పూజా కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలన్నారు. నవంబర్ 25న జరగనున్న భారీ అన్న సమారాధన కార్యక్రమాన్ని కూడా విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో దేవాలయ ట్రస్టీ సూరిశెట్టి పరమేశ్వరరావు, కొయిలాడ దశావతారం, కాండ్రేగుల నూకప్పారావు, మాజీ వైస్ ప్రెసిడెంట్ గుబ్బల సత్యనారాయణ, ఆలయ డైరెక్టర్ సూరిశెట్టి శివ, తదితరులు పాల్గొన్నారు.

గ్యార్వీ షరీఫ్ వేడుకలు ప్రారంభం



కోటవురట్లలో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

కోటవురట్ల: మసీద్ ఉస్మాన్ ఘని, నవజవాన్ యూత్ ఆధ్వర్యంలో గ్యార్వీ షరీఫ్ వేడుకలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. వేడుకలలో భాగంగా గౌస్ పాక్ నిషానీ వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం చందనం ఊరేగింపు నిర్వహించి, ఖురాన్ పఠనం చేశారు. సహపంక్తి భోజనంలో పెద్ద సంఖ్యలో ముస్లింలు పాల్గొన్నారు.


వరిలో సుడిదోమ నివారించాలి



చిరు పొట్ట దశలో వరి పంట

మాడగుల రూరల్: ప్రస్తుతం వరి పంట చిరు పొట్ట దశ నుంచి పోలు పోసుకోనే దశలో వుందని, ఈ దశలో సుడిదోమ ఆశించే అవకాశం ఎక్కువగా ఉంటుదని, ఈ సుడిదోమ, వరి దుబ్బుల మొదళ్ల ఆశించి నష్ట పరుస్తుందని మండల వ్యవసాయాధికారి ఎం.వాసుదేవరావు తెలిపారు. ఆదివారం ఆయన సాక్షితో మాట్లాడారు. ఈ సుడిదోమ వల్ల మొక్కలు గిడసబారి పోషకాలు అందక పసుపు రంగుకు మారి సుడులు సుడులుగా ఎండిపోతాయని, వీటి ఉధృతి అధికంగా వున్నప్పుడు వరి కంకి వరకు ఈ తెగుళ్ల ఆశించి నష్టాన్ని కలుగజేస్తుందన్నారు. ఈ తెగుళ్ల ఆశించినప్పుడు మొదట పొలంలో వున్న నీటిని పూర్తిగా తీసివేసి, రెండు రోజుల పాటు పంట పొలాన్ని పూర్తిగా ఆరబెట్టాలన్నారు. ఈ తర్వాత తగిన సస్యరక్షణ చర్యలు చేపట్టాలన్నారు. సుడిదోమ ప్రారంభం దశలో ఉన్నట్టయితే ఎసిఫేట్ అనే పొడి మందును ఒక లీటరు నీటికి, 1.5 గ్రాములు కలిపి పంట మీద పిచికారీ చేయాలన్నారు. దోమ ఉధృతి అధికంగా ఉంటే డైనెటోఫ్యూరాన్ అనే మందును ఒక లీటరు నీటికి, 0.4 గ్రాములు చొప్పున లేదా పైమెట్రోజైన్ అనే పొడి మందును ఒక లీటరు నీటికి 05 గ్రాములు కలిపి మొక్కలు మొదళ్ల భాగంలో పడేటట్లు పిచికారి చేయాలన్నారు. దీని వల్ల సుడిదోమ తెగుళ్ల పూర్తిగా తగ్గించవచ్చునని ఏవో తెలిపారు.


రెల్లి కులస్తులకు 5 శాతం రిజర్వేషన్ ఇవ్వాలి



సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర రెల్లి కులస్తుల సంఘం అధ్యక్షుడు ప్రసాదరావు

గొలుగొండ : రాష్ట్రంలో రెల్లి కులస్తులు 20 లక్షలకు పైగా ఉన్నారని, ఇటువంటి వెనుకబడిన వారికి ఒక్కశాతం రిజర్వేషన్ ఇవ్వడం తగదని, 5 శాతం రిజర్వేషన్ ఇవ్వాలని రాష్ట్ర రెల్లి కుల సంఘం అధ్యక్షుడు మంగళగిరి ప్రసాద్‌రావు డిమాండ్ చేశారు. ఆయన మండలంలో ఏఎల్‌పురంలో జరిగిన రెల్లి కుల సంఘం సమావేశంలో మాట్లాడుతూ రెండు తెలుగు రాష్ట్రాల్లో ఒక్కశాతమే రిజర్వేషన్ కల్పించడంపై ఆవేదన చెందారు. సహజంగా రెల్లి కులస్తులు బాగా వెనుకబడి ఉన్నారని వారికి రిజర్వేషన్ పెంచాలని కోరారు. రిజర్వేషన్ పెంచకపోతే ఆందోళన చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో కులసంఘం నేతలు ఎర్రంశెట్టి అప్పన్న, మజ్జి నారాయణమూర్తి, కోన రాంబాబు పాల్గొన్నారు.

పెద్దేరుకు తగ్గిన వరద ముంపు



పెద్దేరు జలాశయానికి తగ్గిన నీటిమట్టం

మాడుగుల : ఇటీవల పెద్దేరు జలాశయం కేచ్‌మెంట్ ఏరియాలో కురిసిన వర్షాలకు రెండు రోజుల క్రితం వరకు జలాశయంలోకి 500 క్యూసెక్కులు వరద నీరు వచ్చి చేరేది. అయితే ఆదివారం నుంచి జలాశయంలోకి ఇన్ ఫ్లో 150 క్యూసెక్కులకు తగ్గిపోయింది. ప్రస్తుతం ప్రధాన పంటకాలువలకు 140 క్యూసెక్కుల సాగునీరు విడుదల చేస్తుండడంతో జలాశయం పరిధి 15 వేల ఎకరాల్లో ఖరీఫ్ పంటలకు ఢోకా లేదని జలాశయం అధికారులు చెబుతున్నారు.